237) సాళంగనాట

ప॥ మిన్ను నేలా నొక్కటైనమేటితేరు । కన్నులపండువయినశ్రీకాంతునితేరు ॥

చ॥ జలధులమీదను చక్కగా నేగెను తేరు । బలిమి గులాద్రులపై బారెను తేరు ।
పెలుచులంకముంగిట పేరెలువారెను తేరు । చెలగె దిగ్విజయపుశ్రీహరితేరు ॥

చ॥ రమణ గుండిననగరము చుట్టుకొన్నతేరు । తిమురుచు రుకిమిణి దెచ్చినతేరు ।
సమరములో జరాసంధుని దోలినతేరు । అమరులవెనుబలమగుశౌరితేరు ॥

చ॥ వొట్టి సృగాలవాసుదేవుని భంగించినతేరు । బెట్టుపౌండ్రకునిపై దాడివెట్టినతేరు ।
అట్టె శ్రీవేంకటేశు డలమేలుమంగ గూడి । పట్టమేలుచు నెక్కిన పరమాత్ముతేరు ॥